క్లుప్తంగా

శారదాపీఠాన్ని సందర్శించిన సింహాచలం ఈవో



స్వరూపానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకుంటున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠాన్ని బుధవారం సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి సందర్శించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి ఆశీస్సులు తీసుకున్నారు. రాజశ్యామల అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతితో ఈవో దేవస్థానం అభివృద్ధిపై చర్చించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్వామీజీ పలు సూచనలు చేశారు. ప్రసాద్ స్కీమ్ అమల్లో ఏర్పడుతున్న ఇబ్బందులపై చర్చించారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



నిలిచిన మురుగునీటిని పరిశీలిస్తున్న ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు పరిధి గొల్లవిల్లివానిపాలెం దరి సాయిసాధానగర్‌లో బుధవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు పర్యటించారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ లేక మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుండాన్ని గుర్తించారు. స్థానికులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. దీనిపై స్పందించిన ముమ్మన జీవీఎంసీ శానిటేషన్ అధికారుల దృష్టికి సమస్య తీసుకుని వెళ్లి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న గంట్ల లీలావతి తదితరులు

సింహాచలం: మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు 68వ జయంతిని 97వవార్డు చినముషిడివాడలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గురునాథరావు చిత్రపటానికి 97వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంట్ల లీలావతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మెంటి సూరిబాబు, మహాలక్ష్మి నాయుడు, సూరిబాబు, సాంబశివరావు, కాళ్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య


సింహాచలం: అప్పులబాధతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం పెందుర్తి జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో చోటు చేసుకుంది. జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో వాకాడ అప్పలరాజు భార్య భాగ్యలక్ష్మి(42) నివాసం ఉంటున్నారు. అప్పలరాజు జీవీఎంసీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భాగ్యలక్ష్మి పలుచోట్ల అప్పులు చేయడంతో వారు వచ్చి పదేపదే అడుగుతున్నారు. దీంతో మనస్థాపానికి గురై బుధవారం మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది. సమాచారం అందుకున్న పెందుర్తి సీఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

పోలీసుల అదుపులో మరో ఆరుగురు

కూర్మన్నపాలెం: వివాదాస్పద స్థలంలో అలజడి సృష్టించిన ఘటనలో మరో ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కూర్మన్నపాలెం సర్వే నంబర్ 39/1సీలో 1.06 ఎకరాల స్థలంలో మంగళవారం సాయంత్రం ఓ వర్గానికి చెందిన వారు 100మంది రౌడీమూకతో చొరబడి రేకుల ప్రహరీని ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. దీంతో దువ్వాడ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని రౌడీ మూకలను చెదరగొట్టడంతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుధవారం మరో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

కల సాకారమైన వేళ..

- నేడు సామూహిక గృహప్రవేశాలు
- 173 గృహాలు సిద్ధం



సిద్ధమైన జగనన్న గృహ సముదాయం

పరవాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున సామూహిక గృహ ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 5 లక్షల గృహప్రవేశాలు గురువారం జరగనున్నాయి. అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని.. నిర్మాణ పనులను వేగవంతం చేశారు. మోడల్ కాలనీగా పరవాడ మండలం వెన్నెలపాలెం కాలనీని ఎంపిక చేశారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి,ఎమ్మెల్యే అదీప్‌రాజ్ ఎప్పటికప్పుడు గృహ నిర్మాణాలకు సంబంధించిన పనులపై ఆరా తీశారు. గృహ నిర్మాణశాఖ ఏఈ ఎం.ఎస్.ఎన్.రెడ్డి పర్యవేక్షణలో నిర్మాణ పనులు చురుగ్గా సాగాయి. ప్రభుత్వం పరవాడ మండలంలో 8 జగనన్న లేఅవుట్లలో 871 గృహాలను మంజూరు చేసింది. వాటిలో 360 గృహాలు నిర్మాణాలు పూర్తి చేసుకోగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. పరవాడ–1 లేఅవుట్ పరిధిలోని పరవాడ, వెన్నెలపాలెంలో బడుగు బలహీన వర్గాల వారికి 292 మంది గృహాలు మంజూరు చేయగా వాటిలో 173 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. గురువారం వాటినే సీఎం వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, హౌసింగ్ జిల్లా అధికారి కె.రమామణి, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటున్నారు.

సకల సదుపాయాలతో ప్రారంభం

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేశారు. పూర్తయిన గృహాలకు పెయింటింగ్స్ కూడా పూర్తి చేశారు. సామూహిక గృహ ప్రవేశాల రోజున లబ్ధిదారులకు తాళాలు కూడా అందజేయనున్నారు. జగనన్న కాలనీల్లో ఇంటింటికీ తాగునీరు అందించే బాధ్యతను నీటి సరఫరా విభాగం, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇచ్చే పనిలో ఈపీడీసీఎల్, కాలనీల్లో అంతర్గత రహదారులు, కాలువల నిర్మాణం ఇతర పనుల బాధ్యతల్ని వీఎంఆర్‌డీఏ, పంచాయతీరాజ్ విభాగాలకు అప్పగించగా.. అన్ని పనులను నిర్దిష్ట సమయంలోనే పూర్తి చేశారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కోరారు. వాడచీపురుపల్లి గ్రామంలో బుధవారం నాలుగో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల ఆశీస్సులు పొందిందన్నారు. పేదలందరికీ ఇంటి స్థలాలు, అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, పంటల బీమా, జగనన్న విద్యా కానుక, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు అమలు చేసి ప్రతీ పేదవాడికి మంచి చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న సుపరిపాలన కావాలంటే మరలా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రజలంతా సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు కూండ్రపు తాతాజీ, బండి ముత్యాలు, ఉమా, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, ఈవోఆర్డీ రమేష్‌నాయుడు, వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి, ఏఈలు జి.రామారావు, షణ్ముఖ, శేషసాయి, ఎం.ఎస్.ఎన్ రెడ్డి, డ్వాక్రా సంఘ ప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడికి ఆర్జిత సేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. 1001 నామాలతో స్వామికి తులసితో అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ



మండపం పనులు ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: స్థానిక యంగ్‌మెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు చుక్క రామునాయుడు ఆధ్వర్యంలో సంతబయలు వద్ద నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. మండపం ఏర్పాటు పనులను సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పోతల అప్పలనాయుడు, చల్లా కనకారావు, రెడ్డి సింహాచలం, కర్రి అప్పలనాయుడు, ద్వారపూడి శ్రీనివాసరావు, కె.చిన్నంనాయుడు, పి.జగదీశ్వరరావు, జి.చంద్రరావు, పైల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో మేటి వానప్రస్థ వృద్ధాశ్రమం

శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి



ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న స్వరూపానందేంద్ర స్వామీజీ

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తి తూచా తప్పకుండా అమలు చేస్తూ సామాజిక సేవలో మేటిగా వానప్రస్థ వృద్ధాశ్రమం నిలుస్తోందని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి అన్నారు. 49వ వార్డు పట్టాభిరెడ్డి గార్డెన్స్‌లోని వానప్రస్థ వృద్ధాశ్రమం బుధవారం నిర్వహించిన 12వ వార్షికోత్సవంలో ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీనివాస్ వృద్ధులకు చేస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సనాతన హిందూ ధర్మంలో పూజాధికాలతోపాటు దీనులు, అభాగ్యులను ఆదుకోవడానికి కూడా అత్యంత ప్రాధాన్యముందని పేర్కొన్నారు. పురాణాలు, వేదాల్లో ఈ ప్రస్తావన ఉందని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వృద్ధాశ్రమాల అవసరం ఎంతో ఉందని సూచించారు. నిరాదరణకు గురైన తల్లిదండ్రులను అక్కున చేర్చుకుని సేవలందించడం గొప్ప విషయమని, యువతరం వానప్రస్థ వృద్ధాశ్రమ సేవలను ఆదర్శంగా తీసుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ ఆశ్రమం 25 వసంతాలు పూర్తి చేసుకుని సేవలను మరింతగా విస్తరించాలని స్వామి ఆకాంక్షించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి నిర్వాహకుడు శ్రీనివాస్‌ను అభినందించారు.

బోనస్ చెల్లించాలని ఆందోళన

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు 20 శాతం బోనస్ చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బోనస్ చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ఆందోళన నిర్వహించారు. గనిశెట్టి మాట్లాడుతూ ఈ నెల జీతంతో పాటు 20 శాతం బోనస్ చెల్లించాలన్నారు. కార్మికులంతా ఐక్యంగా పోరాడి బోనస్ సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో జి.సింహచలం, ప్రసాద్, లోవరాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న గ్రామ పెద్దలు

పరవాడ: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మూకీ బాయ్స్ ఆధ్వర్యంలో బుధవారం భర్నికంలో నిర్వహించిన దీపారాధన ఆకట్టుకుంది. మాజీ సర్పంచ్ బొండా తాతారావు, దాట్ల గణేష్ రాజ్ దీపారాధన నిర్వహించిన మూకీ బాయ్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో మనోజ్, రాకేష్, లోకేష్, భార్గవ్, తేజా, మూకీ బాయ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి



ఈవో శ్రీనివాసమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనుబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణి(కోనేరు)తో పాటు అనుబంధ ఆలయాలైన పైడితల్లమ్మ, బంగారమ్మ ఆలయాలను అభివృద్ధి చేయాలని దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తిని ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. దేవస్థానం కార్యాలయంలో బుధవారం ఈవోను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఐదు కోట్లతో పుష్కరిణి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినా పనులు జరగలేదని వివరించారు. అలాగే పైడితల్లమ్మ, బంగారమ్మ తల్లి ఆలయాల అభివృద్ధికి రూ.45లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారని వాటిఇ ఆమోదం తెలిపి పనులు ప్రారంభించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం చిన్నచూపు

కూర్మన్నపాలెం: స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు కార్మికులు నిద్రాహారాలు మాని పోరాటం చేస్తున్నా కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రప్రభుత్వ పెద్దలు ఎందుకింత చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 972వ రోజు బుధవారం సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఈ ప్రాంత ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి కోరారు. మండలంలోని బాటజంగాలపాలెం,నారపాడు గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య శిబిరాలను ఆమె ప్రారంభించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారన్నారు.

కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన స్టాల్స్ పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు, సర్పంచ్ పడాల వెంకట రమణ, ఎంపీటీసీ మామిడి లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

- పాలనలో సీఎం వైఎస్ జగన్ కొత్త ఒరవడి
- ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాసరావు



మహిళలకు బ్రోచర్ అందిస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాస్

సింహాచలం: పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 98వవార్డు అడవివరంలోని ప్రియాగార్డెన్స్, శిడగంవీధి, ఆకులవీధిలో బుధవారం రాత్రి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ అందించిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని పాలన చేస్తున్నారన్నారు. కుల మతాలు చూడకుండా, అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి పాలనలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ప్రవేశపెట్టి ప్రజల చెంతకే పాలన తీసుకువచ్చి మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. టీడీపీ పాలనలో పథకాల కోసం నాయకుల చుట్టూ తిరిగిన సందర్భాలు ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. నేడు అధికారులు, ప్రజా ప్రతినిధులే ప్రజల వద్దకు వెళ్లి వాళ్ల బాగోగులు చూసేలా జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

సమస్యలు వింటూ..

ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆకులవీధిలో సీసీ రోడ్డు , డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని నిర్వాసితులు ముత్తంశెట్టిని కోరారు. అలాగే ప్రియాగార్డెన్‌లో సామాజిక భవనం నిర్మాణం చేయాలని విన్నవించారు. సింహాచలం దేవస్థానం సమస్యతో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు మరమ్మతులు చేసుకోలేని పరిస్థితి ఉందని శిడగంవీధి నిర్వాసితులు ముత్తంశెట్టి దృష్టికి తేసుకెళ్లారు. అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మల్లయ్యనాయుడు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు నడింపల్లి రామరాజు, కర్రి సత్తిబాబు, లంక సత్తిబాబు, దొంతల సంతోష్, సిరిపురపు కృష్ణ, మజ్జి ధర్మా, టి.రాము, శిడగం తాతబాబు, ఎన్.అప్పారావు పాల్గొన్నారు.

చదువుతో పాటు నైతిక విలువలు అవసరం



వాడచీపురుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు

పరవాడ: విద్యా బోధనలో సంస్కారం, నైతిక విలువలు జోడించాలని ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్తి అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం బాలిక అక్షరాస్యత ప్రాధాన్యతపై వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, డిబేట్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎంత ఎత్తు ఎదిగినా.. ఏ స్థాయిలో ఉన్నా తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను మరవ వద్దన్నారు. రాంకీ ఫౌండేషన్ మేనేజర్ డాక్టర్ కసుమెట్ట శ్రీకాంత్ మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా.. నేటి సమాజంలో ఇంకా వారికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదన్నారు. పాఠశాల హెచ్‌ఎం పందిరి కనకేశ్వర్రావు మాట్లాడుతూ నేడు పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో సమాన హక్కులు పొందుతున్నారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా అగ్ని ప్రమాదాలను నియంత్రించవచ్చని లీడింగ్ ఫైర్‌మెన్ కె. అప్పలనాయుడు తెలిపారు. ఆరిపాకలోని శ్రీ సూర్య ప్రకాష్ పాఠశాలలో అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా నష్ట తీవ్రతను తగ్గించవచ్చునని చెప్పారు. మంటలను అదుపు చేయడంపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డి. స్వాతి, లీడింగ్ ఫైర్‌మెన్‌లు కె. రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణలు



వివిధ వేషధారణల్లో విద్యార్థులు

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఒకటో తరగతి విద్యార్థులు వివిధ వేషధారణల్లో వృత్తి ఆవశ్యకతను వివరించి ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి మాట్లాడుతూ పిల్లల మనసు తడి సిమెంటు వంటిదన్నారు. ఉపాధ్యాయురాలు శిరీష, చిన్నారుల తల్లిదండ్రులను అభినందించారు.

వంట సామగ్రి అందజేత

పరవాడ: సీఎస్సార్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలో అనేక ప్రజాపయోగ కార్యక్రమాలు చేపడుతున్నామని ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్తి అన్నారు. మండలంలో వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన వంట పాత్రలు, గ్యాస్ స్టవ్, గ్రైండర్, మిక్సీలను పాఠశాల యాజమాన్యానికి బుధవారం అందజేశారు. సీఎస్సార్ కార్యక్రమాల్లో భాగంగా విద్య, వైద్య రంగాలతో పాటు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నామని ఫౌండేషన్ ప్రతినిధి కసుమెట్ట శ్రీకాంత్ అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి సీఎం జగన్ పెద్ద పీట

పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి



పోషకాహార స్టాల్ ప్రారంభిస్తున్న ఎంపీపీ నాగమణి

సింహాచలం: వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి తెలిపారు. మండలంలోని వాలిమెరకలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సరక్ష శిబిరాన్ని ఎంపీపీ నాగమణి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహించడం జరుగుతోందన్నారు. స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు చేయడమే కాకుండా మందులు ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. మెరుగైన వైద్య సదుపాయానికి రిఫర్ చేయడం జరుగుతుందన్నారు. పెందుర్తి మండలంలో ఇప్పటికి వరకు ఎనిమిది క్యాంపులు నిర్వహించగా ప్రతి చోటా పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. మొత్తం 424 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే 40 మందికి మరింత వైద్యసేవలకు రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, ఎంపీడీవో వసంత, డిప్యూటీ తహసీల్దార్ రంగలక్ష్మి, వాలిమెరక సర్పంచ్ చంద్రవాణి తదితరులు పాల్గొన్నారు.